
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 30 జూన్ 2024



శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ వదిలి పెట్టమని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ స్పష్టం చేశారు. గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, నిరంతర తనిఖీల ద్వారా కట్టడి చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించే వారు ఎంతటివారైనా.. చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ కబ్జాదారుల బారిన పడే సామాన్యులు తమకు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. తగినంత పార్కింగ్ స్థలాలు లేకపోతే కొత్త షాపింగ్ మాల్స్, ఆస్పత్రులకు అనుమతులు ఇవ్వడం లేదు.. అలాగే సెల్లార్లను వ్యాపార అవసరాలకు వినియోగించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నాం..' అని సీపీ తెలిపారు. ఖమ్మం సీపీగా సునీల్‌దత్ బాధ్యతలు చేపట్టి ఆర్నెల్లు పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

శాంతిభద్రతల పరిరక్షణకు
పకడ్బందీ చర్యలు

- గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం
- భూ కబ్జాదారులు ఎంతటివారైనా వదిలి పెట్టం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు
- వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలి
- ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో సెక్టార్ల ఏర్పాటు
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

జవాబు: ఎన్నికల తర్వాత ఖమ్మం జిల్లాలో శాంతిభద్రతల చర్యలను పటిష్టం చేశాం. ప్రతీ స్టేషన్‌ను మూడు సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్‌కు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ స్థాయి వారిని ఇన్‌చార్జిగా నియమించాం. వారు ప్రతి రోజు తమ సెక్టార్‌లో తిరగడం, శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలను గమనించడం, స్థానికంగా జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం చేస్తారు. తద్వారా శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్ర: గడిచిన కొన్నేళ్లుగా పొరుగు రాష్ట్రం నుంచి ఖమ్మం జిల్లా మీదుగా పెద్దఎత్తున గంజాయి రవాణా అనేక రూపాల్లో జరుగుతోంది. దీనిపై పోలీసుశాఖ ఎలాంటి కార్యచరణ చేపడుతోంది?

జ: నిజమే, పొరుగు రాష్ట్రాలనుంచి అనేక మార్గాల ద్వారా గంజాయి రవాణా జరుగుతోంది. ఇందుకోసం జిల్లాలో అన్ని స్టేషన్ల పరిధిలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. అయితే బస్సులు, లారీలు లాంటి వాహనాలను నిరంతరం తనిఖీ చేయడం సాధ్యపడని విషయం. పొరుగు రాష్ట్రాలనుంచి వచ్చే వాహనాలను మాత్రం తనిఖీచేస్తున్నాం. ఇంకా మరింతగా నిఘా చర్యలు పెంచుతాం. పొరుగు రాష్ట్ర పోలీసులతో సమన్వయం చేసుకుని సాధ్యమైనంత వరకు గంజాయి రవాణను నివారించాలన్నది మా సంకల్పం.

ప్ర: చాలా చోట్ల గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని, యువత కూడా గంజాయిపట్ల మక్కువ చూపుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై శాఖపరంగా మీ చర్యలు?

జ: గతంలో అక్కడక్కడ ఇబ్బందులున్న మాట నిజమే. ఇప్పుడు జిల్లాలో, నగరంలో పూర్తిస్థాయి తనిఖీలు, నిఘా చర్యలు చేడపతున్నాం. గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, నష్టాలపై అన్ని కళాశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతను చైతన్యం చేస్తున్నాం. గంజాయి విక్రయించినట్టు తెలిస్తే తనిఖీలు చేసి పట్టుకున్న వారిపై కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నాం.

ప్ర: జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నివారణకు పోలీసుశాఖ తీసుకుంటున్న జాగ్రత్తలు?

జ: సీజన్ ముందునుంచే అన్ని పోలీసుస్టేషన్లను అప్రమత్తం చేశాం. స్థానిక డీలర్లతో సమావేశాలు నిర్వహించి నకిలీ విత్తనాలు, అనుమతిలేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఎవరు అమ్మినా వారిపై కఠిన కేసులతో పాటు లైసెన్సులు రద్దుచేస్తామని

(మిగతా 6వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల

మన దారి రహదారి

ఉమ్మడి జిల్లాలో రహదారులకు మహర్దశ

- కేంద్రం నుంచి రూ.655 కోట్లు మంజూరు
- ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలంలో కొత్త రోడ్ల నిర్మాణం
- ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు
- ఏపీ నుంచి ఆ ఐదు పంచాయతీలను కోరతాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రహదారులకు మహర్దశ రాబోతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రూ.655 కోట్లు నిధులు మంజూరయ్యాయని, డీపీఆర్ అనంతరం టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరికి, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్న ప్రతిపాదించిన రహదారులు కొన్ని ప్రస్తుతం మంజూరైనవాటిలో ఉన్నాయని తెలిపారు.


కొత్తగూడెం పట్టణానికి మూడువైపులా 25కి.మీ. పొడవున అర్ధాకారంలో రింగ్‌రోడ్డు రాబోతుందన్నారు. గతంలో తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు విజయవాడ-జగదల్‌పూర్ రహదారిలో భాగంగా బైపాస్‌రోడ్డుకు ప్రతిపాదించామని, కొత్తగూడెం పట్టణంలో రహదారి ఉండాలన్న డిమాండ్‌తో అది ఆగిపోయిందన్నారు. ఇప్పుడు ఇల్లెందు రోడ్డు అనిశెట్టిపల్లి నుంచి కొత్తగూడెం టౌన్ మీదుగా బైపాస్‌రోడ్ విజయవాడ-జగదల్‌పూర్ రహదారి నుంచి పాల్వంచ వరకు రూ.450కోట్లతో రహదారి రాబోతుందని తెలిపారు.

అలాగే భద్రాచలం పట్టణంలో 7కి.మీ. పొడవున రూ.50కోట్లతో ఆరులైన్ల రహదారి ఏర్పాటు చేయబోతున్నామని, ప్రస్తుతం ఉన్న రహదారిని బ్రిడ్జి నుంచి కొత్తగా నిర్మించే కరకట్ట వరకు రహదారి నిర్మిస్తామన్నారు. తద్వారా పుణ్యక్షేత్ర ప్రాంతంలో రవాణా సౌలభ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. అలాగే రూ.20.22కోట్లతో కిన్నెరసాని బ్రిడ్జికి అనుసంధానంగా మరో బ్రిడ్జి రాబోతోందని మంత్రి తుమ్మల తెలిపారు.

ఖమ్మం పట్టణానికి కొత్తగా నిర్మించబోతున్న జాతీయ రహదారులతో రింగ్‌రోడ్డుకు కూడా నిధులు మంజూరయ్యాయని, గతంలో ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు రూ.180కోట్లతో ప్రతిపాదనలు చేస్తే నిధుల కొరతతో పనులు సాధ్యం కాలేదన్నారు. ఇప్పుడు నాగపూర్-అమరావతి, ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారులు వస్తున్నందున దీనికి అనుసంధానంగా ఖమ్మం-కోదాడ, ఖమ్మం-కురవి రహదారులను కలుపుతూ హైదరాబాదు ఓఆర్ఆర్ వలే ఖమ్మం నగరానికి రింగ్‌రోడ్డు ఏర్పాటు కాబోతుందన్నారు. దీనికి సర్వీసు రోడ్లు కూడా రాబోతున్నాయని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో పాటు ఖమ్మంరూరల్ మండలం కాసిరాజుగూడెం నుంచి 7కి.మీ. పొడవున రూ.120 కోట్లతో రింగ్‌రోడ్డును కలిపే రహదారి నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. అలాగే కొత్తగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద రూ.2.46 కోట్లతో ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కొత్తగా ప్రతిపాదనలు పంపిన వాటిలో శ్రీశ్రీ సర్కిల్ వద్ద రూ.40కోట్లతో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రూ.40కోట్లతో మొత్తం రూ.80కోట్లతో ఫ్లైఓవర్లు రాబోతున్నాయని తుమ్మల వివరించారు. వీటన్నింటికి ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవబోతుందని, అలాగే జిల్లాలో భద్రాచలం నుంచి ఏటూరునాగారం వరకు 93కి.మీ. జాతీ రహదారి, జగ్గయ్యపేట నుంచి వైరా మీదుగా కొత్తగూడెం వరకు 100కి.మీ. భద్రాచలం నుంచి వయా ములకలపల్లి, దమ్మపేట మీదుగా రాజమండ్రి వరకు గతంలో ప్రతిపాదించిన వాటికి ఇంకా మంజూరుకావాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రస్తుతం రూ.1332కోట్లతో కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని, వచ్చే ఆగస్టు 31 నాటికి పనులు పూర్తవు తాయని ఖమ్మం-కురవి రహదారికి టెండర్లు పూర్తయ్యాయని ఇది 2026మార్చి 31వరకు పూర్తవుతుందని తెలిపారు.

ఐదు పంచాయతీలను అడుగుతాం

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన విభజన చట్టం హామీల అమలు, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలపై జరిగే ఉమ్మడి చర్చల్లో భద్రాచలం మండలంనుంచి ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని కోరతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాచలం పట్టణానికి ఆ ఐదు పంచాయతీలు లేకపోవడంతో పట్టణంలో చెత్తవేయడానికి కూడా స్థలం లేదన్నారు. వాస్తవానికి ఈ ఐదు పంచాయతీలు పోలవరం ముంపు పరిధిలో లేవని, భద్రాచలం మండలంలో ఉన్నందున ఆనాడు పట్టణం మినహా పక్కనే ఆనుకుని ఉన్న గ్రామాలు కూడా ఏపీలో కలిపారని తెలిపారు. భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందాలంటే ఈ ఐదు పంచాయతీల అవసరం ఎంతో ఉందన్నారు. విలేకరుల సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





ఇన్‌స్టా స్టార్ ఈ టీచరమ్మ

- బోధన పద్ధతుల్లో వైవిధ్యం
- ఆటాపాట ద్వారా విద్యార్థులకు పాఠాలు
- రీల్స్ వీడియోలకు లక్షల్లో వ్యూస్
- బహుముఖ ప్రజ్ఞ చాటుతున్న తేరాల సాధన

సండే స్పెషల్ SUNDAY SPECIAL

6



సృజనకారుడు.. యాత్రికుడు...

- బహుముఖ ప్రజ్ఞాశాలి కేవీవీఎస్ మూర్తి
- 'గాడ్‌ఫాదర్' నవల తెలుగు అనువాదానికి ప్రశంసలు
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒంటరిగా పర్యటన
- భద్రాద్రి కీర్తిని ఇనుమడింప చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాసమస్యలపై సమరశీల పోరాటాలు

- ఉద్యమ కార్యచరణకు సన్నద్ధం కావాలి
- నిరంతర రాజకీయ శిక్షణ తరగతులు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కూనంనేని



ఖమ్మం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాసమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సన్నదం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట అజెండా రూపొందించుకోవాలన్నారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ పాలకవర్గాలు, ప్రజలను విస్మరించి పాలన సాగిస్తుంటే ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. మోదీ ప్రభుత్వం పేదల పట్ల కక్షసాధింపు ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించిం కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టిందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరగడం వల్ల అశాంతి నెలకొంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ లోక్‌సభ స్థానాలను గెలచుకోవడం ప్రమాదకరమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను దెబ్బతీస్తే బీజేపీ బలపడే అవకాశం ఉందని, అందువల్ల ఈ పార్టీలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జనాభాలో సగభాగం ఉన్న యువతకు కమ్యూనిస్టు పార్టీ భరోసాగా ఉండాలన్నారు. నిరుద్యోగ సమస్యతో పాటు పెరుగుతున్న నిత్యావసర ధరలు, పాలకులు అవినీతి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలన్నారు పార్టీ బలహీనంగా ఉన్న గ్రామాల్లో సైతం నిర్మాణం చేపట్టి గ్రామస్థాయినుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేకశిక్షణ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఈఏడాది డిసెంబరు 26నాటికి సీపీఐ 99ఏళ్లు పూర్తిచేసుకుని వందవ ఏట అడుగుగు పెట్టబోతోందన్నారు. ఈ సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ, కె. అజీజ్‌పాషా, చాడా వెంకటరెడ్డి పాల్గొన్నారు.



అమ్మా క్షమించు...

- తీసుకున్న రుణాలు తిరిగి కట్టలేకపోతున్నా..
- సూసైడ్ నోట్ రాసి లాడ్జిలో వ్యాపారి ఆత్మహత్య
- మృతుడి స్వస్థలం మరిపెడ.. నివాసం మిర్యాలగూడ

శ్రీనివాసరెడ్డి (ఫైల్)

6



స్విమ్మింగ్ పూల్‌లో మునిగి..

- స్నేహితులతో కలిసి నీటిలో ఆడుతుండగా ఘటన
- గత ఏడాదే ఎమ్మెస్ కోసం అమెరికా పయనం
- మృతుడు ఎస్.కిరణ్.. స్వస్థలం చిన్నకోరుకొండి

ప్రజాప్రతినిధుల
డిష్యుం.. డిష్యుం

- ఇల్లెందు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస
- ఎమ్మెల్యే సమక్షంలోనే వైస్ చైర్మన్‌ను కొట్టిన చైర్మన్

ఇల్లెందు, జూన్ 29: భద్రాద్రి జిల్లా ఇల్లెందు మున్సిపాలిటీలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలోనే చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు వైస్ చైర్మన్ ఎస్‌డీ.జానీపాషాల మధ్య ఘర్షణ జరిగి పరస్పర దాడుల వరకు వెళ్లింది. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలోనే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు తీవ్రంగా దుర్భాషలాడుతూ కొట్టుకున్నారు. కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై జరుగుతున్న చర్చల్లో ప్రతి అంశంపై వైస్‌చైర్మన్ జానీ జోక్యం చేసుకోవడంతో విసిగిపోయిన చైర్మన్ వెంకటేశ్వరరావు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జానీ చైర్మన్ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత దూషణలు చేయడంతో ఆగ్రహించిన ఆయన జానీపై మొదట దాడి చేసి కొట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు తీవ్రంగా నిందారోపణలు చేసుకున్నారు. దాంతో తోటి కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే కోరం కనకయ్య వారిద్దరినీ సముదాయించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య ఘర్షణ ఇల్లెందు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. కాగా చైర్మన్, వైస్‌చైర్మన్‌ల మధ్య గత మూడేళ్లుగా నెలకొన్న విభేదాలే తాజా ఘటనకు కారణమని భావిస్తున్నారు. పరస్పరం దాడి చేసుకున్న ఇద్దరూ అధికార కాంగ్రెస్ పార్టీకి చెందినవారే కావడం గమనార్హం. కౌన్సిల్‌లో జరిగిన ఘటనతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఆందోళనకు గురయ్యారు.

అలుపెరుగని సృజనకారుడు.. నిరంతర యాత్రికుడు..

- బహుముఖ ప్రజ్ఞాశాలి కేవీవీఎస్ మూర్తి
- 'గాడ్‌ఫాదర్' తెలుగు అనువాదానికి ప్రశంసలు
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటన
- ఇప్పటివరకు 10 పుస్తకాల రచన
- భద్రాద్రి కీర్తిని ఇనుమడింప చేస్తున్న ఉపాధ్యాయుడు

భద్రాచలం, జూన్ 29: వృత్తి రీత్యా ఉపాధ్యాయుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన.. ప్రవృత్తి రీత్యా నిరంతర యాత్రికుడిగా, పరిశోధకుడిగా, రచయితగా, అనువాదకుడిగా తనదైన శైలిలో రాణిస్తున్నారు. భద్రాచలానికి చెందిన కేవీవీఎస్ మూర్తి స్థానిక నన్నపనేని మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పది పుస్తకాలు, 200 వ్యాసాలు, కవితా సంకలనాలు, ఆంగ్లం, ఒరియా భాషల నుంచి తెలుగులోకి పలు పుస్తకాలను అనువదించారు. ఆయన రచనా తీరును ఎందరో ప్రముఖులు గుర్తించి అభినందించిన సందర్భాలున్నాయి.

ప్రేరణగా అభినవమొల్ల......

కేవీవీఎస్ మూర్తి తన ఎనిమిదేళ్ల ప్రాయం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచారు. అందరూ ఆటలాడుకునే బాల్యంలో గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదవడం



కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత గౌరహరిదాస్‌తో మూర్తి

ప్రారంభించారు. గత ఐదు దశాబ్దాలుగా ఆయన ప్రతి రోజు ఏదో ఒక పుస్తకంలోని 200 పేజీలను చదవడం దినచర్యగా చేసుకున్నారు. కాగా 8వ తరగతి చదువుతున్న సమయంలో అప్పటి తన ఉపాధ్యాయురాలు అభినవమొల్ల చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ ఆయన రచనలకు ప్రేరణగా నిలిచారు. అదేవిధంగా భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలో ప్రముఖ కవి మాల్యశ్రీ తన గురువులాంటి వారనిమూర్తి పేర్కొన్నారు.

పుస్తక రచనలు...

కవితా సంకలనాలు...



ఇప్పటి వరకు కేవీవీఎస్ మూర్తి పది పుస్తకాలు రాశారు. అందులో నిరంతర యాత్రికుడు, గౌర హరిదాస్ కథలు, గాడ్ ఫాదర్, దా వర్జిన్ అండ్ జిప్సీ, దా రివర్‌సైడ్ మ్యాన్ అండ్ అదర్ షార్ట్ స్టోరీస్, మూర్తీస్ మ్యూజింగ్స్, దంతెవాడ కథలను రాశారు. అలాగే కవితా సంకలనాలు, 200 వ్యాసాలను వివిధ పత్రికలకు రాయడం జరిగింది. కాగా ఆంగ్లంలో రచనలను తెలుగులో అనువదిస్తున్న తీరును గుర్తించిన మైసూర్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ సంస్థ ఆరు నెలల పాటు ఆయనను ఔత్సాహికులకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఆహ్వానించగా ఆయన వెళ్లి శిక్షణ ఇవ్వడం మరిచిపోలేని విషయంగా ఆయన పేర్కొన్నారు. అలాగే మాల్గుడి డేస్ రచయిత ఆర్కే నారాయణ్ ఇంటిని సందర్శించడం తనను ఎన్నటికి మరిపోలేనని పేర్కొన్నారు.

అభినందించిన యండమూరి

ప్రపంచంలోనే ఎంతో పేరుగాంచిన 'గాడ్‌ఫాదర్' నవలను తెలుగులోకి అనువదించిన మూర్తికి అది ఎంతో పేరు తెచ్చింది. గాడ్ ఫాదర్ తెలుగు అనువాదం చదిన ప్రసిద్ధ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్, ప్రొఫెసర్ గోపి, ప్రముఖ నటుడు, సినీ రచయిత, కథకుడు తనికెళ్ల భరణి తదితరులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఇదిలా ఉండగా భారత రాజకీయ చరిత్రలో ప్రముఖ



కేవీవీఎస్ మూర్తి రాసిన పుస్తకాలు

స్థానాన్ని దక్కించుకున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జీవిత చరిత్రను ఆంగ్లంలో అనిర్బన్ గంగూలి, శివానంద్ ద్వివేదీలు రచించగా మూర్తి తెలుగులోకి అనువదించారు.

నిరంతర యాత్రికుడు

రచయితగా రాణిస్తున్న కేవీవీఎస్ మూర్తి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించారు. ప్రతి వేసవి, దసరా, సంక్రాంతి సెలవుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో భౌగోళిక, సాంఘిక, సాంస్కృతిక విషయాల మీద పరిశోధనలు చేస్తూ నిరంతర యాత్రికుడిగా కొనసాగుతున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రపంచ పర్యాటకుడు రాహుల్ సాంకృత్యాయన్‌ను స్ఫూర్తిగా తీసుకున్నారు. రాహుల్ సాంకృత్యాయన్ స్వాతంత్రం రాక ముందు నుంచి ప్రపంచంలోని అన్ని దేశాలను చుట్టి రావడం తనను ఎంతగానో ఆకట్టుకోవడంతో మూర్తి సైతం దేశంలోనే వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి మనుషుల జీవన స్థితిగతుల గురించి అధ్యయనం చేసి వాటిని తన మూర్తీస్ ఫోటోస్ బ్లాగ్, ఇన్‌క్రెడిబుల్ భద్రాచలం బ్లాగ్‌ల్లో పొందుపరుస్తారు. ఇదిలా ఉండగా 2018లో బెంగుళూరుకు చెందిన యునైటెడ్ రిలీజియస్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సంస్థ వివిధ భాషల్లోని 15 మంది రచయితలు, కళాకారులను భారత్, శ్రీలంకల మధ్య శాంతి, స్నేహం పెంపొందించేందుకు శ్రీలంకకు తీసుకెళ్లగా అందులో తెలుగుభాష రచయితల్లో కేవీవీఎస్ మూర్తి ఒక్కరే ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించడం జరిగింది. ఫ్లయింగ్‌స్క్వాడ్ టీంలు కూడా ఏర్పాటు చేశాం.

ప్ర: ఖమ్మం జిల్లా పరిధిలో, అలాగే ఖమ్మం నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు, ఇళ్లస్థలాలు ఆక్రమణలకు గురవుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. సామాన్యులకు పోలీసుశాఖ ద్వారా అందే సహాయం?

జ: ప్రభుత్వ భూములను, అలాగే ప్రైవేటు భూములు, ప్లాట్లను ఎవరైనా ఆక్రమించుకున్నట్టు ఫిర్యాదులు వస్తే నేను తక్షణం స్పందిస్తున్నా. వారిపై కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నాం. అయితే కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలు, ఆక్రమణల కేసులకు సంబంధించి పోలీసుశాఖ జోక్యం చేసుకోదు. ఉద్దేశపూర్వకంగా ప్రైవేటు వ్యక్తుల ప్లాట్లు, భూములు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. తమ ప్లాట్లు, భూములు ఆక్రమించుకుని అన్యాయానికి గురైతే వారు నేరుగా ఖమ్మం సీపీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

ప్ర: పోలీసుస్టేషన్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. జిల్లాలో ఎంతవరకు అమలవుతున్నాయి?

జ: జిల్లాలో అన్ని పోలీసుస్టేషన్లు, ఖమ్మం పట్టణంలోని స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాల్స్, హోటల్ తదితర వ్యాపార సముదాయాలు, జంక్షన్ల వద్ద కూడా సీసీ కెమెరాలున్నాయి. అలాగే వ్యాపార షాపుల యజమానులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఏ నేరం జరిగినా సత్వరం కేసును ఛేదించవచ్చు. ఎక్కడైనా షాపుల యజమానులు సీసీ కెమెరాలు పెట్టకపోతే ఇప్పటికైనా స్పందించి ఏర్పాటు చేసుకోవాలి.

ప్ర: పోలీసుశాఖ పరంగా ప్రజలకు మరింత చేరువ కావడానికి శాఖపరంగా ఏమైనా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారా?

జ: ఇలాంటి సేవా కార్యక్రమాల అవసరం సహజంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉంటుంది. అయితే పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మైనర్లు వాహనాలు నడపవద్దని సూచిస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలు, నష్టం గురించి తెలియచేస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం. అలాగే డ్రైవింగ్ శిక్షణ, లైసెన్సుల ఆవశ్యకత, లైసెన్సు లేకుండా ప్రయాణం చేయడం వల్ల జరిగే నష్టాన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో సమావేశాల ద్వారా తెలియజేస్తున్నాం.

ప్ర: ఖమ్మం పట్టణంతోపాటు పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల స్పాట్లున్నాయి. ఈ విషయంలో పోలీసుశాఖ ఏం చర్యలు తీసుకుంటోంది.

జ: ఖమ్మం పట్టణంలో ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్‌తోపాటు ప్రధాన రోడ్లలో ఉన్న సముదాయాల వారికి తప్పనిసరిగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడం జరిగింది. సెల్లార్ల వద్ద పార్కింగ్ ప్లేసులు అని బోర్డు పెట్టాలి. వాటిని వ్యాపారాలకు వినియోగించకూడదు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రులతోపాటు వ్యాపార సముదాయాలకు అనుమతుల విషయంలో చాలా సీరియస్‌గా ఉంటున్నాం. పార్కింగ్ ప్లేసులు లేకపోతే ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. వాహనాల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగుపరిచి రోడ్లపై పార్కింగ్‌లతో జరిగే అంతరాయాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఉమ్మడి జిల్లా నుంచి, అలాగే పొరుగు రాష్ట్రం ఏపీ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. పోలీసుశాఖ పరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జ: గతంలో ఏపీ నుంచి మధిర తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా జరిగిన విషయం వాస్తవమే. దీనిపై శాఖాపరంగా సీరియస్‌గా స్పందించి అక్రమ ఇసుక రవాణా చేసేవారిపై కేసులు పెట్టి అరెస్టు చేశాం. ఇప్పుడు ఇసుక రవాణా తగ్గింది. ప్రభుత్వ పాలసీలో స్థానిక ఇసుక స్థానికంగా ఇళ్లు నిర్మించుకునేవారికి ఎలాంటి ఆటంకం చెప్పకూడదు. అయితే డంపింగ్ యార్డులు పెట్టి ఇసుక వ్యాపారం అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇసుకే కాదు, గ్రావెల్, ఇతర ఖనిజ సంపదను ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలించే వారిపై నిరంతరం నిఘా ఉంటుంది.

భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు, జూన్ 29: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ప్యాకేజీ కోసం కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఇమాంనగర్ సమీపంలో ప్రాజెక్టు పనులను ద్విచక్రవాహనంపై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాల్వ తవ్వటానికి అనుమతించిన రైతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చి స్పెషల్ కేసు కింద రైతులు సంతోషపడే విధంగా ప్యాకేజీ ఇప్పిస్తానని తెలిపారు. సీఎం చేతులమీదుగానే చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. చదువుకున్న రైతుల పిల్లలకు జీవనోపాధి కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. 100 ఎకరాలు కోల్పో యి లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తున్న రైతుల రుణం తీర్చుకోలేదనిదన్నారు. కాల్వ పనులను అడ్డుకోవద్దని, అవసరమైతే కాళ్లయినా పట్టుకుంటానని తెలిపారు. రెండున్నర మీటర్ల కాలవను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే కాల్వ పూర్తయ్యేంత వరకు అధికారులు ఇక్కడే ఉండాలని కోరారు. కాల్వ పనులు ఆగస్టు నాటికి పూర్తిచేసి ఈ ఏడాదే సాగునీరు అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మేడికొండూరు ప్రసాద్, శోభన్‌నాయక్ నాగయ్య, మాలోతు భావన, శ్రీను, వెనిగళ్ల శ్రీహరి, వేణు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



బైక్‌పై కాలవ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఇన్‌స్టా స్టార్ ఈ పంతులమ్మ..

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 29: ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ రూపంలో ఆమె పోస్టు పెడితే మిలియన్ వ్యూస్ అలవోకగా వస్తాయి. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆమె ఇన్‌స్టాలో రీల్స్ స్టార్‌గా ఎదిగింది. మారుమూల గ్రామంలో జన్మించినప్పటికీ తన టాలెంట్‌తో దేశవ్యాప్త అభిమానులను సంపాదించుకుంది. ఆమెపెట్టే పోస్టులను సెలబ్రిటీలు సైతం మెచ్చుకోవటంతోపాటు స్టేటస్‌లుగా పెట్టుకోవటం విశేషం. ఆమె పేరు తేరాల సాధన.. నిత్యసాధన ద్వారా ఆమె తనకంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇమేజ్‌ను సృష్టించుకుంది. వేలాదిమంది ఫాలోవర్స్‌ను సంపాదించుకొని ఔరా.. అనిపించుకుంటోంది... ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మాధాపురం గ్రామానికి చెందిన తేరాల వెంకటేశ్వర్లు, విజయ దంపతుల కుమార్తె సాధన పదవ తరగతి వరకు స్థానికంగా చదివింది. ఇంటర్ ఖమ్మంలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసింది.. డీఎడ్, ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేసిన ఈమె వృత్తి రీత్యా ప్రైవేటు స్కూల్ టీచర్. అయితే బోధనలో తనకంటూ శైలిని సృష్టించుకోవడం ద్వారా ఆమె పాపులర్ అయింది. పాఠాలను ఆటపాటలతో సులభంగా అర్థమయ్యేలా బోధించటం ఆమెకు ఇన్‌స్టాలో గుర్తింపు తెచ్చింది.. అంతేకాదు సెలబ్రిటీగా మార్చింది.

స్వతహాగా పేరడీ పాటలు రాసే సాధన.. 'కుడి భుజం మీద కడవ..' పాటను పాఠ్యాంశంగా మార్చి దేశ సరిహద్దులను పాట రూపంలో విద్యార్థులకు బోధిస్తున్న పాఠాన్ని సెల్ ఫోన్‌లో రికార్డు చేసి ఇన్‌స్టాలో పోస్టు చేసింది.. అప్పటివరకు ఇన్‌స్టాలో కేవలం 200 మంది బంధుమిత్రుల ఫాలోవర్స్ మాత్రమే కలిగి ఉన్న సాధన ఆ మరుసటి రోజుకల్లా పెద్ద సెలబ్రిటీ అయ్యింది.. ఆ పాటను సినిమాలో పాడిన గాయని మంగ్లీ చూసి సినిమా యూనిట్‌ను ట్యాగ్ చేస్తూ స్టేటస్ పెట్టగా దర్శకుడు శేఖర్ కమ్ముల రాహుల్ సిప్లిగంజ్, తదితరులు తాముసైతం స్టేటస్ పెట్టుకున్నారు. దాంతో ఆ వీడియో 10మిలియన్ల వ్యూస్‌ను సాధించింది.. అనేకమంది తమ గ్రూపుల్లో షేర్ చేసుకోవటంతో ఆమె ఫాలోవర్ల సంఖ్య అమాంతం 20 వేలకు పెరిగింది. ఇన్‌స్టాలో స్టార్‌గా మారిన సాధనపై ఒక ప్రముఖ వార్తా ఛానెల్ డాక్యుమెంటరీ రూపొందించగా దానికి సైతం మిలియన్ల వ్యూస్ దక్కాయి.

సాధన తనదైన శైలిలో రూపొందించిన రీల్స్‌ను ఇన్‌స్టాలో పోస్టు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది.. గురువు లేకుండానే స్కూల్ వార్షికోత్సవానికి 'అయోమయం డాక్టర్' అనే డ్రామాను రచించి విద్యార్థులతో ప్రదర్శించటమే కాక అయిదు పాటలకు డాన్స్ చేసి కళారంగంలో గుర్తింపు పొందింది.

ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటా పాట దళాల కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉద్యమానికి ఊతమిచ్చింది.. ఖమ్మంలో ఒక ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా జాయిన్ అయ్యాక విద్యాబోధనలో వైవిధ్యం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. పేరడీ పాటలు ఇతర కళారూపాల ద్వారా సిలబస్‌ను బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటోంది.

నో బ్యాగ్ డే తదితర కార్యక్రమాలకు పాటలు రాసి, నృత్యరీతులను సమకూర్చింది.. కేవలం ఇన్‌స్టా పోస్టులే కాకుండా మంచి కవిగా ఎదిగి అనేక సామాజికాంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే విధంగా కవిత్వం రాసింది. సాధన ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన వీడియోలపై మరికొందరు మీమ్స్ చేయటంతో మరింత పాపులర్ అయ్యింది. కొన్ని షార్ట్ ఫిల్మ్‌లకు కథలు కూడా అందించింది. ఈమె కళా ప్రతిభకుగానూ పలు అవార్డులు వరించాయి.. కళా రంగంలో మరింత ఎదగాలని తన ఆశయమని సాధన తెలిపింది.

అమ్మా క్షమించు...

- తీసుకున్న రుణాలు తిరిగి కట్టలేకపోతున్నా..
- సూసైడ్ నోట్ రాసి లాడ్జిలో వ్యాపారి ఆత్మహత్య
- మృతుడి స్వస్థలం మరిపెడ

ఖమ్మం క్రైం, జూన్ 29: 'అమ్మా నన్ను క్షమించు నిన్ను చూసుకోకుండానే నాన్న వద్దకు వెళుతున్నాను. వ్యాపారం కోసం తీసుకున్న అప్పులు చెల్లించలేకపోతున్నాను. మీరెన్ని సార్లు వద్దని చెప్పినా వినకుండా లోన్లు తీసుకున్నా. ఇప్పుడవి చెల్లించలేక మీకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే దూరమవతున్నాను. నా కుమారుడు నవీన్‌రెడ్డిని మంచిగా చూసుకోండి... బాగా చదివించి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకు కుటుంబ సభ్యులందరు సహాయం చేయండి.. ఇక నేను వెళ్లిపోతున్నా. నేను తీసుకున్న లోన్లకు అప్పులకు అన్నింటికి నేనే బాధ్యుడిని... నా కుటుంబ సభ్యులకు ఎటువంటి సంబంధం లేదు..' అంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది.

మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన యరసాని శ్రీనివాసరెడ్డి (38)అనే వ్యక్తి ప్రైవేట్ వ్యాపారం చేస్తుంటాడు. గతంలో ఖమ్మంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ ఏదులాపురంలో నివాసం ఉండేవాడు. ఆ తర్వాత ప్రైవేటు వ్యాపారం చేసుకుంటూ కొంతకాలంగా మిర్యాలగూడలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలం క్రితం ప్రైవేట్ యాప్‌లు, బ్యాంక్‌లు, క్రెడిట్ యాప్‌లలో వ్యాపారం కోసం లోన్లు తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో తీసుకున్న అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు.

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మిర్యాలగూడలోని తన నివాసంలో మొబైల్ ఫోన్‌ను పెట్టి ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చి నగరంలోని ఓ లాడ్జ్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో లాడ్జ్ సిబ్బంది తలుపుకొట్టగా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్‌ఐ రఫీ లాడ్జికి వెళ్లి గది తలుపును పగలగొట్టి చూడగా శ్రీనివాసరెడ్డి ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. తర్వాత గదిని పరిశీలించగా అప్పులు కట్టలేక సూసైడ్ చేసుకుంటున్నా... అని రాసిన లెటర్ లభ్యమైంది. దీంతో అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

నేడు మధిరలో డిప్యూటీ సీఎం పర్యటన

మధిర, జూన్ 29: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి రోడ్డు మార్గం గుండా ఉదయం 10.30 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఖమ్మంలో అధికారుల, అనధికారుల సమావేశాల్లో పాల్గొని స్తంభాద్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తారు. గాంధీనగర్ నుంచి బొప్పారానికి రూ.1.75కోట్లతో నిర్మించనున్న పీఆర్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. రూ.30కోట్లతో నిర్మించనున్న బోనకల్-ఆళ్లపాడు-వంగవీడు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. చిలుకూరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి శివాలయం వరకు రూ.70లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు, చిలుకూరు-చొడ్డదేవరపాడు రూ.2.85కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, మర్లపాడు -సిద్దినేనిగూడెం రూ.2.75కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు, మాటూరు -ముస్లింకాలనీ వరకు రూ5కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధిర చేరుకొని రాత్రి అక్కడ బస చేస్తారు. సోమవారం ఉదయం తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

రామయ్యకు సువర్ణ తులసి అర్చన

భద్రాచలం, జూన్ 29: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామివారికి శనివారం ఆర్జితసేవలో భాగంగా సువర్ణ తులసి అర్చన నిర్వహించారు. స్వామివారికి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రామయ్యను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఏవీ రవీంద్రబాబు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కుంట సీఆర్‌పీఎఫ్ డీజీపీ సూరజ్‌పాల్ శర్మలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఉచిత నిత్యాన్నదానానికిక ఖమ్మానికి చెందిన ఎస్. భాస్కర్ రావు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన ఆర్. పద్మనాధరావు సుభద్ర దంపతులు రామయ్య రూ.50వేలువిరాళంగా అందజేశారు.

అమెరికా సావనీర్‌లో పేట రచనలకు స్థానం

అశ్వారావుపేట రూరల్, తెలంగాణ అమెరికన్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కన్వెన్షన్ కోసం ముద్రించిన ప్రత్యేక సావనీర్‌లో అశ్వారావుపేట రచనలకు ప్రాధాన్యం లభించింది. అమెరికాలోని వాషింగ్టన్‌లోని సీటెల్‌లో నిర్వహించిన మహాసభల సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈసావనీర్‌లో అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సిద్దాంతపు ప్రభాకరాచార్యులు రచించిన తెలంగాణ సాహిత్య చరిత్రకు చేవ్రాలు పాల్కురికి సోమన అనే వ్యాసానిక, బాల కథకుడు సాత్విక్ సాయికుమార్ రాసిన అపాయంలో ఉపాయం అనే కథా రచనకు స్థానం కల్పించి ముద్రించారు. సావనీర్‌లో తమ రచనలు ఎంపిక చేసిన సావనీర్ కమిటీ ఛైర్మన్ గూడూరు శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్, రాజీబుర్రా, అపర్ణ, హరిచరణ్, హరిశంకర్, శాంతికృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేట రచనలు సావనీర్‌లో ముద్రించటం పట్ల రచయితలకు పలువురు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు అభినందినలు తెలిపారు.

53 కిలోల గంజాయి పట్టివేత

బూర్గంపాడు, జూన్ 29: ఆటోలో తరలిస్తున్న 53కిలోల గంజాయిని బూర్గంపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక శివారులో గల పుష్కరవనం వద్ద శుక్రవారం రాత్రి సమయంలో ఎస్‌ఐ సుమన్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సారపాక నుంచి మణుగూరు క్రాస్‌రోడ్డు వైపునకు వెళ్తున్న ఆటో పోలీసులను చూసి వెనుదిరిగింది. దీంతో అనుమానం వచ్చి ఆటోను ఆపి చూడగా సీట్ల కింద 30ప్యాకెట్లలో రూ.10,78,800లు విలువ చేసే 53కిలోల గంజాయి లభ్యమైంది. ఆటోలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం మండలం వలసగడ్డ గ్రామానికి చెందిన సోయ అప్పారావును అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో మరో ఇరువురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



గంజాయి నిందితులతో పోలీసులు

ఖమ్మంలో కిలో ఎండు గంజాయి స్వాధీనం....

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29: ఏపీ ప్రాంతం నుంచి గంజాయిని అక్రమంగా తీసుకొచ్చి ఖమ్మంలోని యువతకు అమ్మకాలు చేస్తున్న గంజాయి ముఠాను ఖమ్మం వన్ టౌన్ ఎక్సైజ్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మైలవరం ప్రాంతానికి చెందిన బండారు తరుణ్, ఇట్టే నాగవంశీ, చిండే బాజీ, చిండే నాగేంద్రమ్మ, కిష్టా కోటేశ్వరరావులు గంజాయి ముఠాగా ఏర్పాడ్డారు. వీరంతా ఏపీలోని పలు ప్రాంతాల నుంచి ద్వి చక్ర వాహనాలపై ఎవ్వరికి ఎటువంటి అనుమానం కలగకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గంజాయిని అక్రమంగా తరలించి అమ్మకాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇదే గంజాయి ముఠా శనివారం ఖమ్మం కొత్త బస్టాండ్ ఎదుట ఖమ్మం నగరానికి చెందిన షేక్ నన్నేసాహెబ్, షేక్ మస్తాన్‌లకు గంజాయిని అక్రమంగా అమ్మకాలు జరుపుతుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నిందితులతో సహా 1100 గ్రాముల ఎండు గంజాయి, రెండు ద్వి చక్రవాహనాలు, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించారు. తనిఖీల్లో ఎస్‌హెచ్‌వో కృష్ణ, ఎస్‌ఐలు జయశ్రీ, సాయిబాబు, సిబ్బంది రామారావు, శశికాంత్, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పినపాకలో 21కేజీలు....

పినపాక, జూన్ 29: మండలంలోని ఉప్పాక బ్రిడ్జి వద్ద ఏడూళ్లబయ్యారం పోలీసులు శనివారం 21 కేజీల గంజాయిని పట్టుకున్నారు. సమాచారం మేరకు.. ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ వెంకటప్పయ్య తన సిబ్బందితో ఉప్పాక బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, నలుగురు వ్యక్తులు కారులో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడ్డవారిలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలానికి చెందిన అమర్ సింగ్ తండాకు చెందిన జాటోత్ సురేష్ అలియాస్ కన్న, జాటోత్ విజయ్, నునావత్ గణేష్, జాటోత్ భాస్కర్‌లు ఉన్నారు. వీరంతా ఓ ముఠాగా ఏర్పడి, సీలేరు నుంచి గంజాయిని పలువురు వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తున్నట్లుగా పట్టుబడ్డ నిందితులు విచారణలో తెలిపారని ఎస్‌ఐ వెంకటప్పయ్య తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి..

● అమెరికాలో ఖమ్మం జిల్లా విద్యార్థి మృతి

కల్లూరు, జూలై 29 అమెరికాలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ విద్యార్థి మృతి చెందాడు. కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాధ రాజు కిరణ్(20) భారత కాలమాన ప్రకారం శుక్రవారం రాత్రి 8 గంటలకు స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన లక్ష్మీపతిరాజు (లేటు) పెద్ద కుమారుడు కిరణ్ హైదరాబాద్‌లో గత ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అమెరికాలో ఎంఎస్ చదివేందుకు తన తాత శ్రీనాధరాజు కృష్ణమూర్తి ప్రోత్సాహంతో అమెరికా వెళ్లాడు. అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలోని శ్యాంటలిస్ నగరంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి ఓ అపార్టుమెంట్ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లాడు. అయితే ఈత రాని కిరణ్ స్విమ్మింగ్ పూల్‌లోకి దిగి ప్రమాదవశాత్తు 8 అడుగుల లోతులోకి జారిపడ్డాడు. తోటి స్నేహితులకు కూడా పెద్దగా ఈత రాకపోవటంవతో కిరణ్‌కు రక్షించలేక పోయారు. నీట మునిగిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని కిరణ్ స్నేహితులు ముందుగా అతడి బంధువులకు సమాచారం అందించారు. కిరణ్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా అతడి తాత మనవడి కోరికను కాదనలేక ఒక ఎకరం పొలం అమ్మిమరీ ఎంఎస్ చదివేందుకు అమెరికా పంపాడు. మృతుగి తల్లి గృహిణిగా ఉంటోంది. ఎంఎస్ చదవి వస్తాడని ఆశించిన ఆ కుటుంబంలో కిరణ్ మరణ వార్త తీవ్ర విషాదాన్ని నింపింది. కిరణ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అతడి స్నేహితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

జూలై 1న ప్రపంచ 'కగార్ వ్యతిరేక దినం'గా పాటించండి

● సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ విడుదల

పినపాక, జూన్ 29: జల్, జంగల్, జమీన్ కోసం పోరాడుతున్న విప్లవకారులు, ఆదివాసీలపైన ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైనిక శిబిరాలను ఏర్పాటు చేసి సాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా జూలై1 ని ప్రపంచ కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని పిలుపునిస్తూ సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ బుధవారం ఓ పత్రికా ప్రకటన లేఖ విడుదల చేశారు. ఈ మేరకు భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘిభావ కమిటీ జులై 1 ని కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని చేసిన సిపారసులను తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆమోదించిందని లేఖలో పేర్కొన్నారు. 6 నెలల కాల వ్యవధిలో 130 మందిని హతమార్చిన కేంద్ర రాష్ట్ర సైనిక బలగాలు, నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. బీజాపూర్ జిల్లా ముదువెండి గ్రామంలో 6 నెలల పసికందును కడతేర్చిన సైనిక బలగాలు, పిట్టపడా, చిపురు బట్టి, కోర్చెల్, పిడియా, ఆపటోలా, కాకూర్ లాంటి అమానుష, అమానవీయ చర్యలతో నరసంహారం సృష్టించి, చేస్తున్న సైనిక దురాగతాలను యావత్ సమాజం వ్యతిరేకిస్తోందంటూ లేఖలో పేర్కొన్నారు. అమాయకులను హతమారుస్తూ, వారి మృతదేహాలకు డ్రెస్‌లు తొడిగి ఎన్కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారన్నారు. ఈ విప్లవ ఘాతుక చర్యలను ఖండిస్తూ, కగార్ వ్యతిరేక దినాన్ని జరపాలని ఇచ్చిన పిలుపులో భాగంగా తెలంగాణ విప్లవ ప్రజలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, రచయితలు, కవులు, ప్రజాహితులు జులై 1న కగార్ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

దుమ్ముగూడెం/పాల్వంచ, జూన్ 29: మావోయిస్టు దుశ్చర్యలను నిరసిస్తూ దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లోని పలు ప్రధాన కూడళ్లలో శనివారం కరపత్రాలు వెలిశాయి. సరిహద్దు ఛత్తీస్ఎగఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలకు పలువురు ఆదివాసీలు ప్రాణాలతో పాటు, తీవ్రంగా గాయపడ్డారని కరపత్రాల్లో ముద్రించారు. నిజనిర్ధారణ పేరిట హడావుడి చేసే ప్రజాసంఘాలు ఎందుకు స్పందించడం లేదని కరపత్రాల్లో ప్రశ్నించారు.

తప్పిపోయిన చిన్నారి

● ఇంటికి చేర్చిన హమాలీలు

మణుగూరు, జూన్ 29: తన ఇంటి దారి మర్చిపోయిన ఓ చిన్నారిని కొందరు హమాలీలు ఇంటికి చేర్చిన సంఘటన మణుగూరు పట్టణంలో చోటు చేసుకుంది. మణుగూరు సెంటర్ నుంచి సురక్షా బస్టాండ్ దాటి రామానుజారం రహదారి వైపునకు స్కూల్ బ్యాగ్‌తో వెళ్తున్న చిన్నారిని కొందరు హమాలీలు గుర్తించారు. ఆ చిన్నారిని ఆపి వివరాలు సేకరించి పట్టణంలోని బాలాజీ స్వీట్ షాపు వీధిలో రెండో తరగతి చదివే లక్ష్మీగా గుర్తించారు. ఇంటి అడ్రస్ తెలుసుకుని ఆ చిన్నారి నానమ్మకు అప్పగించా రు. జరిగిన విషయాన్ని హమాలీలు ఆమెకు చెప్పారు. పాపను అప్పగించిన హమాలీలకు కుటుంబ సభ్యులు అభినందించారు.



చిన్నారిని చేరదీసిన హమాలీలు

బాలకార్మికులు లేకుండా చూడాలి

● ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ అశోక్

ఖమ్మంక్రైం, జూన్29: బాలకార్మికులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ వి.అశోక్‌కుమార్ అన్నారు. జూలై 1నుంచి 31వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమంలో భాగంగా అడిషనల్ డీజీపీ శిఖాగోయల్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల వారీగా తప్పిపోయిన పిల్లలు గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్పించడం, అనాథలకు పునరవాసం కలిపించేందుకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా వీధి బాలలను చూసినప్పుడు 1098 లేదా 112, 100, స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏడీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ అధికారులు లింగయ్య, లక్ష్మయ్య, సీఐ అప్పా, ఆరోగ్యశాఖ డాక్టర్ ప్రమీల, టి.విష్ణువందన, కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు వెంగమాంబ, శాస్త్రి, యేసుపాదం, ఎతదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు సన్మానం

సత్తుపల్లిరూరల్, జూన్29: మైసూర్‌లో దత్తపీఠం ఆధ్వర్యంలో భగవద్గీతపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన 25మందిని స్థానిక గీతామందిరంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహితలు మాట్లాడుతూ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వారితో 2022లో వసంతి పంచమి సందర్భంగా టెలిగ్రామ్ గ్రూప్‌ను గురువు భార్గవి ప్రారంభించి , పలువురికి శిక్షణ ఇచారని తెలిపారు. ఇటీవల భగవద్గీతపై మైసూర్‌లో దత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గ్రూప్‌ల్లోని 25మందికి స్వర్ణపతకాలు సాధించారని నిర్వహకులు తెలిపారు. శ్లోకాలు, అధ్యాయాలపై గురువు భార్గవి నేర్పిన విధానంతోనే తాము ఈ ఘనత సాధించామని తెలిపారు. కార్యక్రమంలో కొనకళ్ల శారద, వేముల ప్రియ, కొత్తూరు లీలాజ్యోతి, కుమారి, నడిపల్లి నాగమణి, వేముల శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 29: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఆన్‌లైన్లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునేందుకు వెబ్ సైట్ అందుబాటులో ఉంటుంది. వెబ్ ఆప్షన్స్ పూర్తి అనంతరం సాయంత్రం ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది. జూలై 1న బదిలీల ఎలాట్మెంట్ విడుదల కానున్నది. ఎలాట్మెంట్ విడుదలైన వెంటనే బదిలీ అయిన స్థానంలో జాయినింగ్ రిపోర్ట్ చేయవల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలోని 1 నుంచి 5వ తరగతి ఉపాధ్యాయులు సుమారు రెండు వేల మందికి బదిలీలు కానున్నాయి.

రెండున్నర గంటల ఆలస్యంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష


ఖమ్మం రూరల్, జూన్ 29: ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో శనివారం నిర్వహించిన హస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష రెండున్నర గంటలు ఆలస్యంగా జరిగింది. ఈ పరీక్ష కోసం మండలంలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, సత్యనారాయణపురంలోని డేర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్ష సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది. సాంకేతిక సమస్య కారణంగా పరీక్ష ఆలస్యమైందని పరీక్షల నోడల్ అధికారి శ్రీరామ్ తెలిపారు.

గానగంధర్వుడికి పాటల నివాళి.. నా పాట పంచామృతం



మాట్లాడుతున్న శేషు

ఖమ్మం సాంస్కృతికం జూన్ 29: గాన గంధర్వుడు డాక్టర్ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని ఆయనకు పాటల నివాళిగా నా పాట పంచామృతం సంగీత విభావరిని ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రముఖ రచయిత, దర్శకుడు కొత్తపల్లి శేషు, అన్నారు. మరో రచయిత, దర్శకుడు ఎం. ప్రసాద్ తో కలిసి శనివారం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొగిలి ఎంటర్ టైనమెంట్స్ ఆధ్వర్యంలో బాల సుబ్రమణ్యంను స్మరిస్తూ ఆయన పాడిన పాటలను ఆలపించేందుకు పలువురు గాయనీ గాయకులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మొగిలి ఎంటర్ టైనమెంట్స్ నిర్వాహకుడు హాస్య కళాకారుడు గుణకర్ పాల్గొన్నారు.



ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
ఆదివారం 30 జూన్ 2024

రైతుల అభీష్టం మేరకే రైతు భరోసా

- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ
- హాజరైన సొసైటీ సహకరసంఘాల వరంగల్ డిప్యూటీ రిజిస్టార్ వాల్యానాయక్

వైరా/కొణిజర్ల/కారేపల్లి/ముదిగొండ/తల్లాడ, జూన్ 29: రైతుల అభిష్టం మేరకే ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అమలుచేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. రైతు భరోసా మార్పు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్, సొసైటీ అధ్యక్షుడు బొర్రా రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన వైరా విశాల సహకార పరపతి సంఘం జనరల్‌బాడీ సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలుచేసిన రైతుబంధు పథకంలో వేలకోట్లరూపాయల నిధులు దుబార జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. రైతులను ఆదుకొనేందుకు రైతు భరోసా కింద రూ.15వేలు అందజేస్తామని తెలిపారు. ఈ పథకం అమలు రైతుల అభీష్టం మేరకే అమలుచేస్తామని తెలిపారు. రైతుభరోసా అమలుపై రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కనీసం పదెకరాల్లోని పంటలకు రైతు భరోసా చెల్లించాలని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అలాగే పట్టాదారులైన రైతులతోపాటు కౌలురైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులకు కూడా ఈ పథకాన్ని అమలుచేయాలని రైతులు స్పష్టం చేశారు. బొర్రా రాజశేఖర్‌తోపాటు సహకార శాఖ వరంగల్ డీఆర్వో వాల్యానాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మౌలానా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు యన్నం వెంకటకోటారెడ్డి, పసుపులేటి హన్మంతరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, బొల్లెపోగు శ్రీను, మాజీ డైరెక్టర్ మచ్చా నర్సింహారావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్, కౌన్సిలర్ డాక్టర్ డి.కోటయ్య, నాయకులు కట్ల రంగారావు, పణితి సైదులు, ధార్న రాజశేఖర్, మంచల జయరావు, బట్టా పెద్దభద్రయ్య, గడిపూడి రామకృష్ణ, షేక్.రహీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

నిబంధనలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

కొణిజర్ల: ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసాపై శనివారం కొణిజర్ల మండలానికి సంబంధించి సొసైటీ కార్యాలయంలో రైతులకు రైతు భరోసా పై అభిప్రాయ సేకరణను నిర్వహించారు. రైతులనుంచి అభిప్రాయ సేకరణను స్వీకరించేందుకు వరంగల్ నుంచి సొసైటీ సహకారసంఘాల డిప్యూటీ రిజిస్టార్ వాల్యానాయక్ హాజరయ్యారు. రైతులు రైతు భరోసా విషయంలో ఎటువంటి నిబంధనలు లేకుండ ఇవ్వాలని, ఎన్నికల ముందు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని రైతులు తెలిపారు. డిప్యూటీ రిజిస్టార్ వాల్యానాయక్ మాట్లాడుతూ రైతులు అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటేశ్వరరావు,సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరు రమేష్, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, డైరెక్టర్లురైతులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయంమేరకు రైతు భరోసా: డీఏవో

కారేపల్లి: ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా కార్యక్రమం రైతుల అభిప్రాయంమేరకు ఉంటుందని జిల్లా వ్యవసాయఅధికారిణి విజయనిర్మలఅన్నారు.శనివారం మండల కేంద్రంలోని సహకార సొసైటి కేంద్రంలో నిర్వహించినప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు,వైస్ చైర్మన్ ధారవత్ మంగీలాల్, డైరెక్టర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలురైతులు పాల్గొన్నారు.

రైతు మేలుకోసమే రైతుభరోసా

ముదిగొండ: రైతులను ఆర్థికంగా ఆదుకొనేందుకే రైతుభరోసా పథకాన్ని అమలుచేయనున్నట్లు ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి అన్నారు. శనివారం ముదిగొండ రైతువేదికలో రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయా సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధికారి పట్యానాయక్, ఏవో మందుల రాధ, వైస్‌చైర్మన్ బట్టు పురుషోత్తం, వెంకటరత్నం, మౌనిక పాల్గొన్నారు.

సాగుభూములకే వర్తింపజేయాలి

తల్లాడ: సాగుభూములకు రైతుభరోసా వర్తింపజేయాలని తల్లాడ సొసైటీ మహాజన సభ కోరింది. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన రైతుభరోసా అమలుపై అభిప్రాయాల సేకరణకై మహాసభ నిర్వహించారు. వరంగల్ డీఆర్ఏవో వాల్యానాయక్, ఏవో ఎండీ.తాజుద్దీన్, అసిస్టెంట్ రిజిస్టా ర్ షేక్.మౌలానా, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి, సొసైటీ వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, సీఈవో నాగబాబు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారాన్ని వేగిరం చేయాలి

- అధికారులతో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 29: జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కారాన్ని మరింత వేగిరం చేయాలని సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూన్ 15 నుంచి జూన్ 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఐ పట్టా పాస్ పుస్తకం, కోర్టు కేసు, కోర్టు వివాదంలో ఉన్న పట్టా పాస్ పుస్తకం, డేటా కరెక్షన్, జీపీఏ, ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ, కొత్త పట్టా పాస్ పుస్తకాల జారీ, నాలా, ఖాతా మెర్జింగ్, భూ సంబంధిత ఫిర్యాదులు, నాలా పీపీబీ, పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, అర్బన్ ల్యాండ్ తదితరల అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తరువాత సంబంధిత ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి డిస్పోజ్ చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థ ఏర్పాటుకు అనుకూలంగా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని నవీన్‌మిట్టల్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పెండింగ్ ధరణి దరఖాస్తులు డిస్పోజ్ చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పనితీరుతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు: డీఈవో

వైరా, జూన్ 29: పనితీరుతోనే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు వస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ పేర్కొన్నారు. వైరాలోని కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాల(గుట్టబడి) ప్రధానోపాధ్యాయుడైన నాగబత్తిని భాస్కర్‌రావు వీడ్కోలు సభ శనివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని నాగబత్తిని భాస్కర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎస్‌జీటీ నుంచి ఇటీవలే స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందిన భాస్కర్‌రావు తన సర్వీస్‌లో ఎంతోమంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వందలాదిమంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించేలా చేసి వారు ఉన్నత శిఖరాలే తోడ్పాటునిచ్చారని అభినందించారు. భాస్కర్‌రావు ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వైరా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయసంఘాల నాయకులు జీవీ.సూర్యప్రకాశరావు, దొడ్డా వరప్రసాద్, వెలివెట్టి నర్సింహారావు, ఏ.సుధాకర్, వి.రాంబాబు, పెనుగొండ ఉపేందర్, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరి పాల్గొన్నారు.



భాస్కర్‌రావు దంపతులను సత్కరిస్తున్న డీఈవో

'ఎక్సైజ్‌లో పంచాయితీ' బదిలీలు

- ఎస్ఐను భద్రాచలం చెక్‌పోస్టుకు
- హెడ్ కానిస్టేబుల్‌ను ఖాళీ లేకున్న ఖమ్మం స్టేషన్‌కు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29: ఖమ్మం 2వ పట్టణ ఎక్సైజ్ స్టేషన్‌లో చోటు చేసుకున్న ఎస్ఐకు హెడ్ కానిస్టేబుల్‌కు మధ్య జరిగిన వివాదం ఇప్పుడు బదిలీల వివాదంగా మారింది. ఇరువురు వాగ్వాదం చోటు చేసుకొవటంతో ఇద్దరికి పనిష్‌మెంట్ బదిలీలు జరగాలని రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వగా ఆ మేరకు బదిలీలు జరగకపోవటం వివాదంగా మారింది. ఎస్ఐను రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుకు బదిలీ చేయగా హెడ్ కానిస్టేబుల్‌కు మాత్రం ఖాళీలు లేని ఎక్సైజ్‌స్టేషన్‌కు బదిలీ చేసి ఉన్నతాదికారులు వివాదస్పద నిర్ణయం తీసుకున్నారని ఎక్సైజ్‌శాఖలోని ఎస్ఐలు, సీఐలు సైతం ఆక్షేపిస్తున్నారు. కాగా వివాదంలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రెగ్యులర్ పోస్టింగ్ పాల్వంచ ఎక్సైజ్‌స్టేషన్‌లో ఉంది. పనిష్‌మెంట్‌తో బదిలీలు జరిగితే ముందుగా ఆ ఉద్యోగి డిప్యూటేషన్‌ను క్యాన్సిల్ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎస్ఐను రాష్ట్ర సరిహద్దు చెక్‌పొస్టుకు బదిలీ చేసి హెడ్ కానిస్టేబుల్‌ను ఖాళీ లేని ఖమ్మం కేంద్రంలో బదిలీ చేయటం ఎక్సైజ్‌శాఖలో సీఐలు, ఎస్ఐలు ఖండిస్తున్నారు. ఉన్నతాధికారులు సరైన నిర్ణయం తీసుకోకుంటే అధికారులు, కానిస్టేబుల్స్ మధ్య భవిష్యత్‌లో వివాదంగా మారే అవకాశం కనిపిస్తోందని విమర్శలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై జిల్లా ఎక్సైజ్ పర్యవేక్షకులు నాగేంద్రరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కమిషనర్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన కేఎంసీ కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్,జూన్29: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్య శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ. రాజగోపాల్‌ను జిల్లాకోర్టులోని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జికి పూలమొక్కను బహూకరించారు.



జిల్లా న్యాయాధికారితో కమిషనర్

ప్రమాదవశాత్తు బావిలో పడిన ట్రాక్టర్

నేలకొండపల్లి, జూన్ 29: ప్రమాదవశత్తూ వ్యవసాయ బావిలో ట్రాక్టర్ పడటంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండల పరిధిలోని భైరవునిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిపల్లికి చెందిన బాలిన వీరబాబు తన వ్యవసాయబావిలో మోటార్‌కు డ్రమ్ము కట్టడానికి బావిలోకి దిగాడు. బావిలోకి దిగే ముందు ట్రాక్టర్‌పై ఆమెను కూర్చోబెట్టి, తాను చెప్పినప్పుడు ట్రాక్టరును ముందుకు కదిలించమని చెప్పాడు. కాగా బావిలో డ్రమ్ము కట్టడం పూర్తయ్యాక ట్రాక్టరును ముందుకు కదిలించమని చెప్పగా, ట్రాక్టర్‌కు రివర్స్ గేర్ పడి ఒక్కసారిగా బావిలో పడిపోయింది. ట్రాక్టరు బావిలో పడే సమయంలో తిరగల పడటంతో ఆమెకు, బావిలో ఉన్న వీరబాబుపై ట్రాక్టర్ పడటంతో అతడు సైతం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

నలుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఖమ్మంక్రైం, జూన్29: ఖమ్మం కమిషనరెట్‌లో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న నలుగురికి ఎస్ఐలుగా ఉద్యోగొన్నతి కల్పిస్తూ పోలీస్ శాఖ ఉన్నతాదికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం వన్‌టౌన్‌లో ఏఎస్ఐ గా ఉన్న జి.బీమా, ఖమ్మం ట్రాఫిక్‌లో ఏఎస్ఐలుగా ఉన్న కె.సుబ్బారావు, ఏ.విష్ణుమూర్తి, ఖమ్మం త్రీటౌన్‌లో ఏఎస్ఐగా ఉన్న సుబ్బారావులు ఎస్ఐలుగా ఉద్యోగన్నతి పోందారు. వారిని శనివారం సీపీ సునిల్‌దత్ తన కార్యాలయంలో అభినందించారు.

రేపు మాలమహానాడు విస్తృతస్థాయి సమావేశం

ఖమ్మంచర్చి కాంపౌండ్, జూన్ 29: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం ఖమ్మంలోని జడ్పీసమావేశమందిరంలో నిర్వహించే మాల మహానాడు విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని మాలమహానాడు నగర వర్కింగ్ అధ్యక్షుడు పేరం మల్లయ్య కోరారు. శనివారం నగరంలోని 52వ డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న దళితులను విభజించేందుకు, ఎస్సీ వర్గీకరణకు మద్ధతును ఇచ్చే ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు తలారి రాధాకృష్ణ, కుమ్మరి వీరబాబు,కొప్పుల నర్సింహారావు,ఫిరంగి నరసింహారావు,శ్రీను, మహిళా నేత కాశిమల్ల భవాని పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి: సీపీఎం

ఖమ్మం రూరల్, జూన్ 29: యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని మంచికంటి హాల్లో ఖమ్మం రూరల్ మండల సీపీఎం శిక్షణ తరగతులు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శనివారం ఈ తరగతులను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంబించారు. నున్నా మాట్లాడుతు డబ్బుతో ముడిపడిన నేటి రాజకీయాల్లో విలువలు కొరవడినవని, వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి రావడంతో డబ్బుకు అడ్డు, అదుపు లేకుండా పోయిందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి భ్రష్టు పట్టిన రాజకీయాలను నీతివంతం చేయాలని కోరారు. అనంతరం ఆర్థిక విదానాలు-ప్రజలపై ప్రభావం అనే అంశంపై జిల్లా కమిటి సభ్యులు బండారు రమేస్ క్లాసును బోదించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్, అద్దంకి తిరుమలయ్య, పాలేరుడివిజన్ ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వర్లు, ఊరడి సుదర్శన్‌రెడ్డి, షేక్ బషీరుద్దీన్, పి.సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ర్యాంకర్లకు మంత్రి తుమ్మల అభిందన

కల్లూరు, జూన్ 29: ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. శనివారం ఖమ్మంలో తన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కల్లూరుకు చెందిన ఎస్‌కె సనా, ఇంటర్ బెటర్మెంట్ పరీక్ష ఫలితాల్లో 438/440, ఈదర దివ్య 436/440, ఎస్ రాధకృష్ణసాయి 436/440 మార్కులు సాధించారు. వారు గతంలో కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో పదవ తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామర్ పాఠశాల వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, భవిష్య మెడికల్ ఆకాడమీ చైర్మన్ బండి రామిరెడ్డి, డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపక బృందం భాస్కరరావు, రవీంద్రరెడ్డి, సత్యనారయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి మంత్రి తుమ్మల పరామర్శ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29: 54వ డివి.రజం కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్దార్ ఇటీవల అనారోగ్యానికి గురి కావటంతో ప్రవేట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రైవేట్ హాస్పటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఖమ్మం మున్సిపల్ మాజీ చైర్మన్ అఫ్రోజ్ సమీన సమీప బంధువులు ప్రముఖ వ్యాపార వేత్త నయిం మరణించటంతో కుటుంబ సభ్యులను తుమ్మల పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, మిక్కిలినేని నరేందర్, ఫావుకత్‌ఆలీ, మహ్మద్ ఆశ్రుఫ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 29: మున్సిపల్ కార్మికులకు చట్టబద్ధంగా అందాల్సిన వేతనాలను 13నెలలుగా బకాయిలు ఉంచటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రగతి శీల మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ రామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ వేతనాలను మేడే కానుకలను, పీఆర్సీలను ఇవ్వాలని ఇల్లెందు మున్సిపాలిటీలో మూడు రోజుల నుంచి కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించటం లేదని ఆరోపించారు. జెట్టి గురవయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కంకణాల శ్రీనివాస్, దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, వీరబాబు, మోహన్‌రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 29:'వర్షాకాలం ప్రారంభమైంది వ్యాధులు వ్యాపించే సమయం ఆసన్నమైంది. జిల్లాలో సీజనల్ వ్యాధులు సంభవించకుండా ముందస్తు ప్రణాళికలు తయారుచేసి అమలు చేయనున్నాం' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి తెలిపారు. జిల్లాలో గతంలో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, అతిసారం , టైఫాయిడ్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. శనివారం ఆమె విలేకరులకు వివరాలను తెలిపారు. గతంలో ఏ ప్రాంతంలో ఎక్కువగా వ్యాధులు వచ్చాయి. జ్వరాల బారిన పడిన ప్రాంతాలను గుర్తించి ఏ విధంగా అరికట్టాలనే అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు.

కిరాయిలు చెల్లించాలని కారు యజమానుల ఆందోళన

సత్తుపల్లిరూరల్, జూన్29: లోకసభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో ఎలక్షన్ డ్యూటీలో వినియోగించిన తమ వాహనాలకు కిరాయిలు చెల్లించాలని కార్ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సుమారు 50కు పైగా కార్లను 10రోజుల తర్వాత ఇస్తామని చెప్పి ఎన్నికల నిమిత్తం అద్దెకు తీసుకోగా ఇప్పటికీ చెల్లించలేదని, కార్లకు ఈఎంఐలు కట్టుకోవాలని, డ్రైవర్లకు జీతాలివ్వాలివ్వాలని, వాపోయారు. ఒక్కో వాహనానికి రూ.50వేల పైనే కిరాయిలు ఇవ్వాల్సి ఉందని, ఇదే విషయమై కలెక్టర్, ఎంపీఐ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని, తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బీ.నాగేశ్వరరావు, జోజీ, బీ.శ్రీను, వెంకటేశ్వరరావు, మహేష్, ఎస్.శ్రీను, కే.సోమశేఖర్‌రావు, సీహెచ్.రాధాకృష్ణ, తిరుమల, జే.రాజేష్, ఎస్‌కే.రహీమ్, వాసు, శివ, కే.మాధవరావ పాల్గొన్నారు.

పరీక్షలలో పోటీతత్వంపై అవగాహన ఉండాలి

సత్తుపల్లి, జూన్ 29: పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి పోటీతత్వంపై అవగాహన ఉండాలని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. 3రోజులుగా మండలంలోని కొత్తూరులోని తమ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసిందని తెలిపారు. కార్పోరేట్ ఎకోసిస్టమ్, లీడర్‌షిప్ కాంపిటేటీవ్స్‌పై జరిగిన చర్చాగోష్ఠిలో ఎలా ఉద్యోగం పొందడానికి కావాల్సిన నైపుణ్య స్కిల్స్‌పై మైకాస్ స్కిల్ ల్యాబ్ (హైదరాబాద్)కు చెందిన లీడర్‌షిప్ కోచ్ ఏ.సుధాకర్ విద్యార్థులకు వివరించారు. ఐటీ సంస్థ క్యాట్ జెమినీలో విజేతలుగా నిలిచేందుకు మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యానారాయణ, టీపీ సెల్ ఆఫీసర్ రాఘవరాజు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 29: ఇటీవల ఇచ్చిన ఉద్యోగోన్నతుల్లో భౌతిక శాస్త్ర సబ్జెక్టు ను మరచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని టీపీటీఎఫ్ జిల్లా కమిటి ఆరోపించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడు భౌతికశాస్త్ర ఖాళీలు, ప్రభుత్వ పాఠశాలలో 4 భౌతిక శాస్త్ర ఖాళీలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి నీ అవలంబించడం మంచిది కాదని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ అన్నారు.

జాతీయస్థాయిలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 29: నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన కాంటెస్ట్‌లో నగరంలోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ తృతీయ స్థానంలో నిలిచారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు అభినందిస్తూ శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలను మెమోంటోలు అందించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు, పాఠశాలల డీజీఎం చేతన్ మాధుర్, కోఆర్డినేటర్ క్రిష్ణారావు, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎస్. శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణా రెడ్డి, సురేష్, డీన్స్ కె.వి.ఆర్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రానైట్ సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే కూనంనేనిని కలిసిన గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 29: ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల విషయమై శనివారం గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని ఆయన క్యాంప్ ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కలిసి గ్రానైట్ సమస్యలైనా సబ్సిడీలు, స్లాబ్ సిస్టం, పెరిగిన రాయాలిటీ విషయం పై సవివరంగా వివరించామని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటరమణ తెలిపారు. ఈ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఖమ్మం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమల మనుగడకు తన వంతు కృషిని శక్తివంచను లేకుండా చేస్తానని హమి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటరమణ, పాడిబండ్ల యుగంధర్, పారా నాగేశ్వరావు, రాకేష్, టైల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్. శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

టీఏవీఆర్ విధానంలో గుండెకు ఆపరేషన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 29: ఖమ్మంలో ఓ మహిళకు గుండెకు బైపాస్ సర్జరీ ద్వారా కాకుండా టీఏవీఆర్ విధానంలో ఆపరేషన్ చేసి విజయవంతంగా కోలుకుందని వెంకటేశ్వర ఆస్పత్రికి చెందిన గుండె నిపుణులు డాక్టర్ హర్షతేజ తెలిపారు. శ నివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం నగరానికి చెందిన ఓ 70 ఏళ్ల వృద్ధ మహిళకు క్రిటికల్ కార్డియాక్ కండిషన్‌ను అత్యాధునిక ట్రాన్స్ క్యాథెటర్ అయోటిక్ వాల్ రిప్లేస్మెంట్(టీఏవీఆర్) విధానం ద్వారా విజయవంతంగా చికిత్స చేసినట్లు తెలిపారు. ఛాతీలో తీవ్రమైన గుండె వైఫల్యం, అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఆమె కోమోరబిడిటీల కారణంగా సంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీ వలన నష్టం జరిగే ఆస్కారం ఉందని గమనించి తక్కువ ఇన్వేసివ్ విధానం అవసరాన్ని గుర్తించి డాక్టర్ హర్ష తేజ టీఏవీఆర్ విధానాన్ని ఎంచుకున్నారు. ఇది తొడ దమని ద్వారా (రక్తనాళం) ద్వారా నిర్వహించినట్లు వివరించారు. టీఏవీఆర్ పద్ధతితో బృహద్ధమని కవాటాన్ని క్యాథెటార్ ద్వారా మార్పిడి చేశామని దీని వలన ఓపెన్ హార్ట్ సర్జరీని నివారించినట్లు చెప్పారు. ఈ పద్ధతి అధిక ప్రమాదం ఉన్న రోగులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రోగి తొందరగా కోలుకొని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వడానికి సురక్షితమైన ప్రత్యామ్నాయమన్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని మందుల సహాయంతో ఆమె త్వరగా సాధారణ జీవితానికి తిరిగి వచ్చిందని తెలిపారు. అత్యంత అరుదైన ఆపరేషన్‌ను ఖమ్మంలో మొట్టమొదటిసారిగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ చికిత్స విధానం సాధారణంగా హైదరాబా దు లాంటి మెట్రో నగరాల్లో, ప్రధాన పట్టణాలలో 20 నుంచి 35 లక్షల ఖర్చవుతుందని మొట్టమొదటిసారిగా తక్కువ ఖర్చుతో అ త్యాధునికమైన వైద్య సేవలు అందించినట్లు ఆయన వివరించారు.



ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు

మాజీ మంత్రి డీఎస్ మృతికి పలువురి సంతాపం

ఖమ్మంకార్పొరేషన్,జూన్29: మాజీమంత్రి,మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) మృతిచెందటంతో బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి, శ్రీనివాస్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుల ధర్మపురి అరవింద్, సంజయ్‌లను పరామర్శించి, డీఎస్ మృతికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు

డీఎస్ మృతికి, రమేష్ రాథోడ్ మృతికి నామా సంతాపం

మాజీమంత్రి,మాజీఎంపీ ధర్మపురి శ్రీనివాస్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్‌రాథోడ్ మృతికి మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ధర్మపురి శ్రీనివాస్ మృతివార్త తెలియగానే నామా ఆయన కుమారుడు ఎంపీ అరవింద్‌కు ఫోన్‌చేసి పరామర్శించారు. శ్రీనివాస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా ఆదిలాబాద్ మాజీఎంపీ రమేస్‌రాథోడ్ టీడీపీ, టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాన్ని నామా గుర్తుచేసుకున్నారు.

డీఎస్ మృతిపట్ల మున్నూరు కాపుసంఘ సంతాపం

సత్తుపల్లి: కాంగ్రెస్ నాయకులు డీ.శ్రీనివాస్ మృతిపట్ల సత్తుపల్లి మున్నూరు కాపుసంఘ సంతాపం తెలిపింది. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు చేపట్టారని, మున్నూరు కాపుసంఘ అభివృద్ధికి దోహద పడ్డారని ఆసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రామిశెట్టి సుబ్బారావు అన్నారు. ఆయన అంత్యక్రియలు నేడు రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించనుందని తెలిపారు.